క్లుప్తంగా

మౌలిక వసతులు కల్పించండి


కమిషనర్ స్వామికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని స్థానికులు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ.. వార్డులో పార్క్ ఏర్పాటు చేయాలని, తాగునీరు మురికిగా వస్తున్నాయని, రాతి చెరువు కట్టపై వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, వీధి కుక్కల వల్ల ఇబ్బంది పడుతున్నామని సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పాల్వంచ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్, పడిగల శ్రీనివాస్, మీరావలి, సైఫుల్లా, అహ్మద్ బాషా, వినయ్, చంద్రమౌళి, దీపక్, శివ, రవి, చందు పాల్గొన్నారు.

మిర్చి తోటల పరిశీలన


తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సుజాతనగర్: వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో మిర్చి తోటలను పరిశీలించారు. తోటల్లో ఎండుతెగులు, రసం పీల్చే పురుగులు తెల్లదోమలు, తామర పురుగులను గమనించారు. ఎండు తెలుగు, వైరస్ తెగులు ఆశించిన మొక్కలను పీకివేయాలని, ఎకరానికి 25-30 నీలి, పుసుపు రంగు జిగురు అట్టలను పెట్టుకోవాలని సూచించారు. అదే విధంగా వేపనూను 10,000 పిపిఎం, 250 ఎంఎల్ మొక్క ఆకు అడుగు భాగాన తడిచేలా పిచికారీ చేయాలని చెప్పారు. తప్పనిసరి పరిస్థితిలో సైనోసాడ్, థయోమిథాక్సాన్ పది రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు శ్రీనివాసరావు, శివ, మండల వ్యవసాయ అధికారి నర్మద, విస్తరణ అధికారి శరత్‌చంద్, రైతులు పాల్గొన్నారు.

పెనగడపలో గడపగడపకూ కాంగ్రెస్


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చుంచుపల్లి: పెనగడప గ్రామంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గోపాలరావు, తూము చౌదరి ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఇటీవల సోనియాగాంధీ చెప్పిన ఆరు హామీలతో కూడిన ప్రచారపత్రాన్ని అందజేశారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమన్నారు. పార్టీకి అన్నివర్గాల ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోరే బాబు, తాండ్ర నాగబాబు, పొంగులేటి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా సురేష్

కొత్తగూడెంరూరల్: ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా అజ్మీర సురేష్ నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య బుధవారం నియామక పత్రం అందజేశారు.

వాగుపై వంతెన నిర్మించేదెన్నడో..?

- సురారం సాగు భూములన్నీ బండల వాగు అవతలి వైపే
- అవస్థలు పడుతున్న రైతులు, కూలీలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


సురారం బండల రేవు వాగు ఇదే

జూలూరుపాడు: మారుమూల గిరిజన గ్రామం సురారంలో బండల రేవు వాగుపై వంతెన లేకపోవడంతో రైతులు, కూలీలు తీవకన ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా సురారం గ్రామ సమీపంలో ఉన్న బండల రేవు వాగు ఆ గ్రామ ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. కనకగిరి అటవీ ప్రాంతంలో ఉన్న సురారం గ్రామంలోని ప్రజలంతా వ్యవసాయ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో 328 కుటుంబాలు, మొత్తం జనాభా 1253. సాగు భూములన్నీ వాగు అవతలి వైపునే ఉండటంతో రైతులు, కూలీలు పొలం పనులకు వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. వానాకాలంలో బాధలు వర్ణనాతీతం. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా గ్రామ సమీపంలోని కనకగిరి అటవీ ప్రాంతం నుంచి వచ్చే వరదనీటితో బండల వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. పొలం పనులకు వెళ్లిన రైతులు, కూలీలు తిరిగి ఇంటికి చేరుకోవడానికి వాగు దాటడం కష్టంగా ఉండటంతో ఉధృతి తగ్గే వరకు అవతలి వైపు నిరీక్షించాల్సిన పరిస్థితి. భారీ, అతిభారీ వర్షాలు కురిస్తే పంట పొలాలకు వెళ్లే పరిస్థితి ఉండదని, ఒక్కోసారి వరద గ్రామంలోని ఇళ్లలోకి కూడా వచ్చి చేరుతుందని వాపోతున్నారు. ఆకాశంలో కారు మేఘాలు కమ్ముకుంటే పొలం పనులకు వెళ్లిన వారంతా వర్షం రాకముందే ఇంటి దారి పట్టాల్సిందేనని, లేకపోతే వాగు దాటే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పశువులు, మూగజీవాలు మేత కోసం పొలాలకు వెళ్లడం కష్టంగా ఉందన్నారు. ఎండ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాలీలు, ట్రాక్టర్లపై ఎరువులు తీసుకెళ్లడం కష్టతరమన్నారు. వాగు దాటే క్రమంలో పలు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. బండల రేవు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం, ఆ తరువాత ముఖం చాటేయడం షరామామూలు అయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై జూలూరుపాడు ఐటీడీఏ ఏఈ వెంకటనాగ ప్రసాద్‌ను వివరణ కోరగా.. ఇటీవల బండలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ఐటీడీఏ(ఎస్టీ సబ్ ప్లాన్) నిధులు రూ.70 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. టెండర్ ప్రకియ దశలో ఉన్నట్లు తెలిపారు.


తాడు సాయంతో వాగు దాటుతున్న రైతులు(ఫైల్)

ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్నాం



తాత, తండ్రుల నుంచి బండల రేవు వాగు దాటి పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు వంతెన నిర్మాణానికి కృషి చేస్తామంటున్నారు. ఆ తరువాత ఇటు వైపు తిరిగి చూడటం లేదు. బ్రిడ్జి నిర్మిస్తే మా కష్టాలు తీరుతాయి.

– బానోత్ బాల, రైతు, సురారం

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



బండల రేవు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాం. ఏళ్లు గడుస్తున్నా మోక్షం కలగడం లేదు. కనీసం లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికైనా నిధులు మంజూరు చేయాలి. ఇప్పటికైనా మా గోడు ఆలకించి బ్రిడ్జి నిర్మించాలి.

– బానోత్ హరిలాల్, రైతు, సురారం

వాగు దాటడం ప్రమాదంగా ఉంది



వానొస్తే వాగు దాటడం ప్రమాదకరంగా ఉంది. ఏ కొద్దిపాటి వాన వచ్చినా పై నుంచి వచ్చే వరదకు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. పంట పొలాలకు వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. వాగు ఉధృతి కారణంగా మనుషులు, పశువుల ప్రాణాలు పోతున్నాయి.

– సిద్దెబోయిన పుల్లారావు, రైతు, సురారం

నియోజకవర్గ అభివృద్ధే ఎజెండా..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధే తన జెండా అని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని 6, 12, 25, 21 వార్డులైన రామవరం, ఎస్సీబీ నగర్, హనుమాన్‌బస్తీ, గణేష్ బస్తీలలో సుమారు రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో రూ.215 కోట్లతో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని, పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు వివరించారు. తాను వలస నాయకుడిని కాదని, తన జన్మస్థలం కొత్తగూడెం నియోజకవర్గమేనని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, వచ్చే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, కౌన్సిలర్లు కూరపాటి విజయలక్ష్మి, సత్యవతి, బండి నర్సింహా, సాహెరబేగం, కోలాపూరి ధర్మరాజు, రుక్మాంగధర్‌బండారి, పరమేష్, అంబుల వేణు, వేముల ప్రసాద్, భూక్యా శ్రీను, ఎం ఏ.రజాక్, సుందర్‌రాజ్, యూసఫ్, మదా శ్రీరాములు, కూరపాటి సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

అభివృద్ధి చేస్తున్నా.. ఆశీర్వదించండి


మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: సీఎం కేసీఆర్ ఆశీస్సులతో టేకులపల్లి మండలంలో గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పనులు చేస్తున్నానని వచ్చే ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. తొలుత మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదోమైలు తండా, మద్రాస్ తండా, కొత్తతండా(పి) పంచాయతీల్లో రూ.4.50 కోట్లతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. నిర్మించాల్సిన రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. మాట్లాగుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బానోతు హరిసింగ్‌నాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీ భూక్యా రాధ, ఇల్లెందు జెడ్పీటీసీ ఉమాదేవి, బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు నాయక్, బానోత్ రామ, కంభంపాటి చంద్రశేఖర్, బానోత్ కిషన్, దళపతి శ్రీనివాస్‌రాజు, లక్కినేని శ్యామ్, అప్పారావు, పాపా, రాజేందర్, జరుపుల బిచ్చా, కాలే ప్రసాద్, బానోత్ కృష్ణ, ఉండేటి బసవయ్య, అనంతుల శ్రీను, జాటోత్ నరేష్, బానోత్ రవి, జరుపుల రాజు, లచ్చు, సుందర్, ధరావత్ బాలాజీ, చందర్, సపావత్ రాజేష్, ,కుమ్మరి కిరణ్, ముచ్చ జయరాజు, కొట్టే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

తెలంగాణలో కేసీఆర్ పాలన వచ్చిన తరువాత అన్ని కులవృత్తుల వారికి న్యాయం జరుగుతోందని, వారి ఆర్థికాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాల అమలు జరుగుతోందని, ఇందులో భాగంగానే మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అన్నారు. ఈ మేరకు జిల్లా మత్స్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 31 గ్రామ పంచాయతీల్లోని చెరువులు, కుంటలకు గాను మొత్తం 4. 88 లక్షల చేపపిల్లలను మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీడీఓ కోట వీరబాబు, అప్పారావు, వరప్రసాద్, బాలు, శ్రీనివాసరాజు, రామ, కిషన్, మత్స్యకారులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ కార్మికుల నిరవధిక సమ్మె


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మిడ్ డే వర్కర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మిడ్ డే మీల్స్ కార్మికులు బుధవారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. బకాయి బిల్లులు చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, చట్టబద్ధ హక్కులు, పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మె ప్రారంభించారు. కలెక్టరేట్ వద్ద ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులకు వంట చేస్తూ కడుపునింపుతున్న మహిళా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు కేవలం రూ.వెయ్యి గౌరవ వేతనం ఇస్తూ చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. అది కూడా ప్రతినెల చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. శ్రమకు తగిన వేతనం చెల్లించాలని పలుమార్లు ఆందోళనా కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ధ్వజమెత్తారు. గుడ్లు, ఆకుకూరలు, పప్పు, నూనెల బకాయి బిల్లులు, ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో మహిళా కార్మికులు అప్పులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ, ఆశ తదితర స్కీమ్, కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచి మిడ్ డే మీల్స్ కార్మికుల విషయంలో మాత్రం వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎండీ యూసుఫ్, సత్తెనపల్లి విజయలక్ష్మి, దాసుల పుష్ప, మంగ, రాధ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం బంద్

పాల్వంచరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనాలు ఇవ్వాలని, నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వంటలు చేయడం నిలిపివేశారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచే భోజనాలు తెచ్చుకున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో 84 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు వండిపెట్టే నిర్వాహకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించాలని విన్నవించారు.

‘స్వచ్ఛతా హీ సేవా’పై పోటీలు


ఇల్లెందురూరల్: బహుమతులు అందజేస్తున్న కార్యదర్శి మల్లేష్

టేకులపల్లి: పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో గంగారం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, తడి పొడి చెత్త, పర్యావరణ పరిరక్షణ, హరితహారం తదితర అంశాలపై విద్యార్థులకు చిత్ర లేఖనం, ఉపన్యాసం, వ్యాసరచన, రంగోలీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాయం సమ్మయ్య, కార్యదర్శి చింతాల శ్రీహరి, వార్డు మెంబర్ రమణ, వీఓఏ జోగ శిరోమణి, మూతి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ జోగ సరిత, ఉపాధ్యాయులు బాలు నాయక్, స్వామి, మోత్కూరి శారద పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలలో భాగంగా పలు గ్రామపంచాయతీలలో బుధవారం విద్యార్థులకు పోటీలు నిర్వహించి సర్పంచ్‌లు, కార్యదర్శులు బహుమతులు అందజేశారు. మాట్లాడుతూ.. పల్లెలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అన్నివర్గాల ప్రజలు సహకరించాలని సూచించారు.

24న గద్దర్ సంస్మరణ సభ


మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): గద్దర్ అమరత్వం, జహీర్ అలీఖాన్ లౌకికత్వాన్ని ఈనెల 24న, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరగనున్న స్మారక స్ఫూర్తి సదస్సు ద్వారా ప్రజలకు చాటిచెబుతామని ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. బుధవారం కొత్తగూడెం క్లబ్‌లో సెప్టెంబర్ 24న జరగనున్న సదస్సు ప్రచార సమాయాత్త సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా మాట్లాడుతూ.. ప్రజా యుద్ధ నౌకగా, ప్రజా కళాకారుడిగా, ప్రజా గాయకుడిగా పేరుగాంచిన గద్దర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో గద్దర్ పాత్ర ప్రముఖమైందని, ఆటపాటలతో తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసి, స్వరాష్ట్ర ఉద్యమం వైపు నడిపించిందన్నారు. గద్దర్ ఆటకు, పాటకు ప్రాణమైన చిరకాల ప్రజాస్వామిక లౌకిక వాది సిసాసత్ పత్రిక మేనేజి ంగ్ ఎడిటర్, విద్యావేత్త, జహీర్ అలీఖాన్ గద్దర్ అంతిమ యాత్రలో ప్రాణాలొదలటం బాధాకరమన్నారు. భారత రాజ్యాంగాన్ని , సెక్యూలరిజాన్ని కాపాడు కోవాలని గద్దర్, జహీర్ తమ తుదిశ్వాస వరకు ప్రజలను చైతన్యవంతం చేసే బాధ్యతను మోశారని వారి ఆశయాలను సాధించేవరకు తెలంగాణ సమాజం కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఐదు దశాబ్దాలపాటు తన స్వర ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించిన గద్దర్ సంస్మరణ సభకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ శాసనసభా పక్షనేత మల్లు భట్టివిక్రమార్క, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్, న్యూడెమొక్రసీ పార్టీల రాష్ట్ర నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, ఆవునూరి మధులతోపాటు ఆత్మీయ అతిథులుగా ప్రొఫెసర్లు కంచె ఐలయ్య, చింతకింది కాసి, ప్రజాకవి జయరాజు, కవి, గాయకులు జర్నలిస్ట్ పాశం యాదగిరి, బేబిరాజు, ఆకునూరి మురళి, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి రమేష్‌బాబు హాజరు కానున్నారని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): క్రీడలు మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి ఉపకరిస్తాయని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు అన్నారు. సింగరేణి వ్యాప్తంగా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలను బుధవారం ఏరియా స్థాయి క్రీడలను ఆయా ఏరియాల జీఎంలు ప్రారంభించారు. కార్పొరేట్ ఏరియాలో జీఎం వెల్ఫేర్ కట్టా బసవయ్య ప్రారంభించగా, కొత్తగూడెం ఏరియాలో కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ క్రీడలను జీఎం శాలేంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. కార్మికులు క్రీడల్లో పాల్గొనటం మూలంగా వారిలో పాజిటివ్ థింకింగ్ పెరుగుతుందని, దానివలన వ్యక్తిగత జీవితాల్లో ఉన్నతస్థాయికి చేరటానికి ఉపకరిస్తుందన్నారు. గెలుపుఓటములను సమానంగా స్వీకించాలని, ఏరియా లెవల్‌లో గెలిచి, రీజియన్, కంపెనీ లెవల్, కోలిండియా లెవల్‌లో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, సీఎంఓఏఐ అధ్యక్షుడు పాలడుగు శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ డి.కిరణ్‌బాబు, బి.శివకేశవరావు, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్, యూనియన్ నాయకులు కే.ఆల్బర్ట్, విజయగిరి శ్రీనివాస్, వై.ఆంజనేయులు, గట్టయ్య, మొగిలిపాక రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘సెల్ఫీ విత్ గణేష్’కు స్పందన

కొత్తగూడెంటౌన్: పర్యావరణ పరిరక్షణలో భక్తులను భాగస్వాములను చేస్తూ మట్టి వినాయకుడిని పూజించాలని ‘సాక్షి’ఇచ్చిన పిలుపునకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తాము ప్రతిష్ఠించిన మట్టి వినాయక విగ్రహాలకు పూజలు చేస్తూ భక్తులు పంపించిన సెల్ఫీ ఫొటోలలో ఎంపిక చేసిన వాటిని ప్రచురిస్తున్నాం.


మట్టి గణపతి విగ్రహానికి పూజ చేస్తున్న జూలూరుపాడుకు చెందిన ఐశ్వర్య


కొత్తగూడెం కూలీలైన్‌లో ఏర్పాటు చేసిన 24 అడుగుల మట్టి విగ్రహంతో కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి


పాల్వంచ: అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు


ఇల్లెందు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు

పాల్వంచ: అంగన్‌వాడీ సమస్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే స్పందించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా బుధవారం పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటిని ముట్టడించారు. దీంతో ముందస్తుగా పోలీసులు భారీకేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, సీఐటీయూ నాయకుడు దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమ్మెపై ప్రభుత్వ వైఖరి సరికాదన్నారు. కేసీఆర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. దీంతో ఎమ్మెల్యే వనమా వారి వద్దకు వచ్చి మాట్లాడారు. మంత్రి సత్యవతి రాథోడ్‌తో మాట్లాడి రెండో రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోనె మణి, విజయ, పద్మ, భారతి, మాధవి, రూప, సునీత, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్ రావు, ఎండీ.యూసఫ్, సీపీఎం నాయకులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: 10 రోజులుగా అంగన్‌వాడీలు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఆగ్రహించిన అంగన్‌వాడీలు బుధవారం ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘం నేతలు అబ్దుల్ నబీ, దేవరకొండ శంకర్, ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, కామేపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి


సుజాతనగర్: మాట్లాడుతున్న ఐలయ్య

డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. వీరికి సీపీఎం, న్యూడెమోక్రసీ, టీపీటీఎఫ్, సీఐటీయూ నాయకులు వేర్వేరుగా సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లి: సంఘీభావం తెలుపుతున్న హరిలాల్


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధు


జూలూరుపాడు: చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ ఉద్యోగులు